సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం

# సీమకిరణం

SEEMAKIRANAM TELUGU DAILY

జాతీయ తెలుగు దినపత్రిక

ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా

www.seemakiranam.com
www.seemakiranamnews.com
epaper.seemakiranam.com

ప్రచురణ : కర్నూలు & శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా.

PUBLISHED BY : KURNOOL & SRI POTTI SRIRAMULU NELLORE DISTRICT

ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 08 సంచిక : 830 | పేజిలు : 04, వెల రూ. 2 రూ/ | శనివారం 20-06-2026

★కోల్‌కతాలో ప్రముఖ పారిశ్రామికవేత్తలతో మంత్రి నారా లోకేశ్ భేటీ

★ఏపీలో పెట్టుబడులకు ఉన్న సానుకూల అంశాలను వివరించిన లోకేశ్

★రాష్ట్రాన్ని పారిశ్రామిక, తయారీ హబ్‌గా మార్చడమే లక్ష్యమన్న మంత్రి

★ఏపీ ప్రభుత్వ చురుకైన విధానాలను అభినందించిన పారిశ్రామికవేత్తలు

★రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని వ్యాపారవేత్తలకు విజ్ఞప్తి

★కోల్‌కతాలో ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సదస్సులో లోకేశ్ కీలక ప్రసంగం

★స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్ అనే మూడు సూత్రాలతో ఏపీ ముందుకు వెళ్తోందని వెల్లడి

★రాష్ట్ర అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములు కావాలని పెట్టుబడిదారులకు ఆహ్వానం

★సంస్కరణల అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ముందంజలో ఉందని వివరణ

### బలమైన రాష్ట్రాలే బలమైన దేశాన్ని నిర్మిస్తాయి..

# మాకు ఇగోలు లేవు

**ఏపీ పారిశ్రామికాభివృద్ధికి సహకరించండి**

**పారిశ్రామికవేత్తలకు మంత్రి లోకేశ్ పిలుపు**

**బెంగాల్ స్ఫూర్తి.. రాష్ట్రాల మధ్య పోటీ అవసరం**



బలమైన రాష్ట్రాలే బలమైన దేశాన్ని నిర్మించగలవని, రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఏపీ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్ అనే మూడు ప్రధాన సూత్రాలను ప్రత్యేకతలుగా చేసుకుని ఆంధ్రప్రదేశ్ ముందుకు సాగుతోందని, ఈ అభివృద్ధి ప్రయాణంలో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కోల్‌కతాలోని ఐటీసీ సోనార్ హోటల్‌లో ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) నిర్వహించిన ప్లీనరీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 'ఏపీలో పెట్టుబడులకు గల అవకాశాలు' అనే అంశంపై మిగతా 2లో

### మణికొండలో జనసేన కొత్త కార్యాలయాన్ని

# ప్రారంభించిన పవన్ కల్యాణ్

గత కొద్ది రోజులుగా తెలంగాణ రాజకీయాలపై ప్రత్యేక దృష్టిసారించిన ఆయన.. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సొంతంగా పోటీ చేసేందుకు సిద్ధం అవుతున్నారు.

ప్రతి పంచాయతీలో ఒక నర్సరీ

'వీబీ-జీరామ్‌జీ' పథకం కింద నర్సరీల పెంపకం

కొండల్లో చల్లేందుకు 2.6 కోట్ల సీడ్ బాల్స్ సిద్ధం



ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మణికొండలో జనసేన కొత్త కార్యాలయాన్ని ప్రారంభించారు. గత కొద్ది రోజులుగా తెలంగాణ రాజకీయాలపై ప్రత్యేక దృష్టిసారించిన ఆయన.. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సొంతంగా పోటీ చేసేందుకు సిద్ధం అవుతున్నారు. ఇందులో భాగంగానే హైదరాబాద్‌లోని మణికొండలో జనసేన పార్టీ తెలంగాణ నూతన రాష్ట్ర కార్యాలయాన్ని జనసేనాని పవన్ కల్యాణ్ తన చేతుల మీదుగా అత్యంత వైభవంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పార్టీ ముఖ్య నాయకులు, పీఏసీ సభ్యులు, భారీ సంఖ్యలో తరలివచ్చిన జనసైనికులు, వీరమహిళలతో మణికొండ ప్రాంతం మొత్తం సందడిగా మారింది. నూతన కార్యాలయంలో మిగతా 2లో

### కౌలు రైతులకూ

## "అన్నదాత సుఖీభవ" వర్తింపజేయాలి



❊రైతులకు యూరియా కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

❊ఆక్వా రైతులను ఆదుకున్నట్టు ప్రభుత్వం డ్రామాలాడుతోంది

❊ఫీడ్ రేటు రెండుసార్లు రూ. 14లు పెంచి రూ.4లు తగ్గించారు

రైతులకు యూరియా కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, కౌలు రైతులకు కూడా అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేయాలని మాజీ మంత్రి కురసాల కన్నబాబు డిమాండ్ చేశారు. కాకినాడలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులను పూర్తిగా గాలికొదిలేసిందని, వైయస్ జగన్ గారు ప్రశ్నిస్తే తప్ప ప్రజా సమస్యల పట్ల ప్రభుత్వంలో చలనం రావడం లేదని చెప్పారు. రెడ్ బుక్ రాజ్యాంగం కారణంగానే రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, మాది మంచి ప్రభుత్వమని చెబుతూనే ప్రజలను మిగతా 2లో

# కృష్ణలంక పోలీస్ స్టేషన్ సీసీ టీవీ ఫుటేజ్‌లన్నీ విడుదల చేయాలి

**గాదె సాయికృష్ణది ప్రభుత్వ హత్యే**

●రెడ్ బుక్ రాజ్యాంగం కారణంగానే దారుణాలు

●అందుకే నిందితులుగా సీఎం, మంత్రి లోకేష్, హోంమంత్రి అనితలను చేర్చాలి

●సీఐపై హత్యాయత్నం కేసు నమోదు చేశారంటే సాయికృష్ణని చంపేశారని ప్రభుత్వం ఒప్పుకున్నట్టే

●సీఐ నాగరాజుని బలిచేసి మిగతా పోలీసు ఉన్నతాధికారులను తప్పించే కుట్ర



కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో లాకప్ డెత్‌కి గురైన కాపు యువకుడు గాదె సాయికృష్ణది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని, రెడ్ బుక్ రాజ్యాంగం అమలు కోసం పోలీసులను విచ్చలవిడిగా వాడుకుంటున్న మిగతా 2లో

### సీఎం చంద్రబాబు అధ్యక్షతన

# 235వ ఎస్ఎల్‌బీసీ సమావేశం..

**జూన్ 20వ తేదీన అన్నదాత సుఖీభవ**

●అండగా ఉంటాం.. సాయికృష్ణ తల్లికి సీఎం చంద్రబాబు భరోసా

●ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ) సమావేశం జరిగింది.

●ఏపీ సచివాలయంలోని 5వ బ్లాక్‌లో శుక్రవారం మధ్యాహ్నం 235వ బ్యాంకర్ల సమావేశాన్ని నిర్వహించారు.



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ) సమావేశం జరిగింది. ఏపీ సచివాలయంలోని 5వ బ్లాక్‌లో ఈరోజు (శుక్రవారం) మధ్యాహ్నం 235వ బ్యాంకర్ల సమావేశాన్ని నిర్వహించారు. మిగతా 2లో

### నీట్ సూసైడ్ బాధిత కుటుంబాలకు

## కోటి పరిహారమివ్వండి




⌘నీట్ పేపర్ లీకేజీ వల్ల కొందరు విద్యార్థులు మానసిక ఆందోళనకు గురవుతున్నారు.

⌘దేశవ్యాప్తంగా కొన్ని చోట్ల విద్యార్థులు ఆ టెన్షన్ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నారు.

న్యూఢిల్లీ: నీట్ పేపర్ లీకేజీ వల్ల కొందరు విద్యార్థులు మానసిక ఆందోళనకు గురవుతున్నారు. దేశవ్యాప్తంగా కొన్ని చోట్ల విద్యార్థులు ఆ టెన్షన్ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నారు. మిగతా 2లో

## ట్రంప్ మాట బేఖాతరు.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు

●దక్షిణ లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు

●వైమానిక దాడుల్లో దాదాపు 16 మంది మృతి

●ఇటీవలే అమెరికా-ఇరాన్ మధ్య ఒప్పందం



ఇరాన్-అమెరికా మధ్య తాజాగా కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన గంటల్లోనే మళ్లీ ఉద్రిక్తతలు మొదలయ్యాయి. లెబనాన్ దక్షిణ ప్రాంతాలపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో కనీసం 16 మంది మరణించినట్లు అక్కడి ప్రభుత్వ వార్తా సంస్థ వెల్లడించింది. మిగతా 2లో

## అమెరికానే ఒప్పందం కోసం ఆత్రుత చూపింది: ఖమేనీ

●అమెరికాతో కుదిరిన ఒప్పందంపై ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ ఆసక్తికర వ్యాఖ్యలు

●నిరాశతో ట్రంప్ అనేక ఒత్తిళ్లు తెచ్చినట్లు వెల్లడి

●ఒప్పందంపై తనకు భిన్నాభిప్రాయం ఉందని వ్యాఖ్య

●భవిష్యత్తులో అదనపు డిమాండ్లు తెస్తే అంగీకరించమని స్పష్టీకరణ



అమెరికా-ఇరాన్ మధ్య ఇటీవల కుదిరిన అవగాహన ఒప్పందంపై ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మిగతా 2లో

### కూటమి ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న

## నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం



❖కూటమి ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు.

❖రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన ఈ రెండేళ్లలో సూపర్ సిక్స్ హామీలు విజయవంతంగా అమలు చేశామన్నారు.

❖మిగిలిన సంక్షేమ కార్యక్రమాలు దశలవారీగా పూర్తి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నామని కేంద్ర పౌర విమానయాన మిగతా 2లో

➤ఈ కేసులో సీఐ ఒక్కడిని బాధ్యుడిగా చేస్తే సరిపోదు

➤ఈ నేరంలో విజయవాడ సీపీ, డీజీపీకీ భాగముంది

➤ఈ ఘటనకు బాధ్యులైన వారందరిపై మర్డర్ కేసు పెట్టాలి

➤కొడుకు కోసం ఆ తల్లి పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరిగింది

➤ఫొటోకు దండ వేసుకోమని సీఐ హేళన చేశారు

➤ఆమె ఇచ్చిన ఫిర్యాదును పోలీసులు చెత్తబుట్టలో పడేశారు

➤సాయికృష్ణను చంపేశాక లీడర్ల ద్వారా తల్లితో బేరసారాలు

➤తల్లి హైకోర్టును ఆశ్రయించడంతో పోలీసుల్లో భయం

➤బాధిత కుటుంబానికి అండగా వైఎస్సార్‌సీపీ

➤చివరికి చంపామని ఒప్పుకుంటూ సీఐ సస్పెన్షన్

➤మే నెలలోనే ఇలాంటి ఘటనలు రెండు జరిగాయి

### విజయవాడ కస్టడీ డెత్:

# సీబీఐ విచారణ జరిపించాలి

**విజయవాడ కస్టడీ డెత్ కేసుపై సీబీఐ విచారణకు జగన్ డిమాండ్**

**మే 9 నుంచి అదృశ్యమైన యువకుడు సాయికృష్ణ**

**బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వ తీరుపై విమర్శలు**

విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో 25 ఏళ్ల గాదె సాయికృష్ణ అనుమానాస్పద మృతిపై సీబీఐ విచారణ జరిపించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సాయికృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం మిగతా 2లో



### నాసిరకం మందుల చెలామణిపై

## ఉక్కుపాదం మోపాలి



⏩గత రెండేళ్లలో కనిపించిన పురోగతితో అలసత్వం వద్దు

⏩ఉదాసీనంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవు

⏩ఏడాదికి 13వేల నమూనాల సేకరణ జరగాలి

నాసిరకం ప్రాణధార మందులను త్వరగా గుర్తించి, వాటి విక్రయాలను నిరోధించడంలో విజయవాడలోని రాష్ట్ర ఔషధ పరీక్ష ప్రయోగశాల కీలక పాత్ర పోషించబోతుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. గడిచిన రెండేళ్లలో కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలవల్ల మిగతా 2లో

## ట్రంప్ మాట బేఖాతరు..

# లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు

దీంతో పశ్చిమాసియాలో పరిస్థితి మళ్లీ ఆందోళనకరంగా మారింది.దక్షిణ లెబనాన్‌లోని పలు ప్రాంతాలపై గురువారం రాత్రి నుంచి దాడులు కొనసాగుతున్నట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. మరోవైపు హెజ్బొల్లా కూడా ఆ ప్రాంతంలో తీవ్ర ఘర్షణ జరుగుతోందని తెలిపింది. ఈ పరిణామం ఇరాన్-అమెరికా మధ్య కుదిరిన తాజా ఒప్పందానికి సవాల్‌గా మారింది. ఆ ఒప్పందం ప్రకారం లెబనాన్‌తో సహా అన్ని ప్రాంతాల్లో సైనిక చర్యలు వెంటనే నిలిపివేయాలి. అలాగే లెబనాన్ సార్వభౌమాధికారాన్ని గౌరవించాల్సి ఉంటుంది.అయితే ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాత్రం వెనక్కి తగ్గేది లేదనే సంకేతాలు ఇచ్చారు. హెజ్బోల్‌ంలా నుంచి ముప్పు పూర్తిగా తొలగే వరకు లెబనాన్‌లో సైనిక చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. మరోవైపు ఇరాన్-అమెరికా ప్రతినిధుల మధ్య స్విట్జర్లాండ్‌లో జరగాల్సిన తదుపరి చర్చలు కూడా వాయిదా పడ్డాయి. శాశ్వత శాంతి ఒప్పందంపై చర్చించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశారు.అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ. వాన్స్.. స్విట్జర్లాండ్ పర్యటనను వాయిదా వేసుకున్నారు. అధికారికంగా సాంకేతిక కారణాలే కారణమని వైట్‌హౌస్ తెలిపింది. కానీ, లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతుండటంతో ఇరాన్ తన ప్రతినిధి బృందాన్ని పంపడంలో జాప్యం చేస్తోందన్న వార్తలు వెలువడ్డాయి.ఇటీవలే అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేశారు. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుతాయన్న ఆశలు వ్యక్తమయ్యాయి. కానీ లెబనాన్‌లో తాజా దాడులతో ఆ ఆశలపై నీళ్లు చల్లినట్లైంది. ఒప్పందం తర్వాత మాట్లాడిన వాన్స్.. ఇజ్రాయెల్‌కు పరోక్ష హెచ్చరిక కూడా చేశారు. ప్రస్తుతం ప్రపంచంలో ఇజ్రాయెల్ పట్ల అత్యంత సానుకూలంగా వ్యవహరిస్తున్న నాయకుడు ట్రంప్ మాత్రమేనని వ్యాఖ్యానించారుఇప్పటికే యుద్ధంతో అల్లకల్లోలంగా మారిన పశ్చిమాసియాలో పరిస్థితులు ఏ దిశగా వెళ్తాయన్న దానిపై ప్రపంచ దేశాలు నిశితంగా గమనిస్తున్నాయి. లెబనాన్‌లో హింస ఆగకపోతే ఇరాన్-అమెరికా శాంతి ప్రయత్నాలకు గండిపడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## అమెరికానే ఒప్పందం కోసం ఆత్రుత చూపింది: ఖమేనీ

ఈ ఒప్పందం కోసం అమెరికానే ఎక్కువగా ప్రయత్నించిందని, అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర ఒత్తిళ్లు, వివిధ రకాల దౌత్య ప్రయత్నాలు ఉపయోగించి ఒప్పందాన్ని సాధించారని పేర్కొన్నారు.సోషల్ మీడియా వేదికగా చేసిన ప్రకటనలో ఖమేనీ "అమెరికా అధ్యక్షుడు నిరాశతో అన్ని రకాల ప్రభావాలను ఉపయోగించి ఈ ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకు ప్రయత్నించారు. ఇరాన్ అధికారులు నిజాయతీగా చర్చలు జరిపారు. అయితే ఈ ఒప్పందంపై నాకు సూత్రప్రాయంగా భిన్న అభిప్రాయం ఉంది" అని తెలిపారు. అయినప్పటికీ ఇరాన్ ప్రజల హక్కులు, దేశ ప్రయోజనాలు, 'రెసిస్టెన్స్ ఫ్రంట్' ప్రయోజనాలు కాపాడతామన్న హామీతో ఒప్పందానికి అనుమతి ఇచ్చినట్లు వెల్లడించారు.భవిష్యత్తులో ఒప్పందానికి మించి అమెరికా అదనపు డిమాండ్లు చేయాలని ప్రయత్నిస్తే వాటిని ఇరాన్ అంగీకరించబోదని ఖమేనీ స్పష్టం చేశారు. దేశ ప్రజలు ఓర్పుతో ఉండాలని, ఒప్పందంలో పేర్కొన్న షరతులు అమలవుతాయో లేదో గమనించాలని ఆయన సూచించారు.ఈ ఒప్పందంపై సంతకాలు ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ ఆతిథ్యంలో వెసాయ్ ప్యాలెస్‌లో జరిగిన ప్రత్యేక విందు సందర్భంగా జరిగాయి. జీ7 సదస్సు ముగిసిన అనంతరం ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. మేక్రాన్ ఈ ఒప్పందాన్ని స్వాగతిస్తూ ఇది పశ్చిమాసియాలో శాశ్వత శాంతికి మార్గం సుగమం చేస్తుందని, అలాగే ప్రపంచ ఇంధన సరఫరాకు అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధిని తిరిగి పూర్తిస్థాయిలో తెరవడానికి సాయపడుతుందని పేర్కొన్నారు.

## కౌలు రైతులకూ "అన్నదాత సుఖీభవ" వర్తింపజేయాలి

కాల్చుకుతింటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇంటిలిజెన్స్ విభాగం అనేది పనిచేస్తోందా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం మేకప్‌లపై పెట్టిన శ్రద్ధ లాకప్‌లలో జరిగే ఘోరాలపై పెడితే సగం నేరాలను అరికట్టవచ్చని మాజీ మంత్రి కురసాల కన్నబాబు స్పష్టం చేశారు. గుడివాడ అమర్నాథ్‌కి నోటీసులిచ్చిన మహిళా కమిషన్, సాయి కృష్ణ తల్లి ఫిర్యాదును పట్టించుకోని సీపీకి ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఆక్వా రైతలను దగా చేస్తోంది. రెండు విడతలుగా రూ.14 లు ఫీడ్ రేటు పెంచి ఇప్పుడు రూ.4 లు తగ్గిస్తూ వారిని ఆదుకున్నట్టు డ్రామాలాడుతోంది. కూటమి ప్రభుత్వం రైతులను వెన్నుపోటు పొడిచింది. వైయస్సార్ రైతు భరోసా పథకానికి అన్నదాత సుఖీభవగా పేరు మార్చి వదిలేశారు. మొదటి ఏడాది ఒక్క రూపాయి పెట్టుబడి సాయం ఇవ్వకుండా మోసం చేశారు. రెండో ఏడాది 7 లక్షల మంది రైతులకు ఎగ్గొట్టారు. కౌలు రైతులకు పథకం అందడం లేదు. వైయస్సార్సీపీ హయాంలో 53.58 లక్షల మంది రైతులకు రైతు భరోసా సాయం అందితే నేడు 46.86 లక్షల మందికే అన్నదాత సుఖీభవ అందిస్తామని చెబుతున్నారు. మొంథా తుపాన్ నష్టపరిహారం ఇప్పటికీ అందలేదు. సున్నా వడ్డీ రుణాల ఊసేలేదు. ఆత్మహత్య చేసుకున్నఏ ఒక్క రైతు కుటుంబాన్ని ఆదుకోలేదు. ఈ క్రాపింగ్ చేయడం లేదు. ఉచిత పంటల బీమా ఊసే లేదు. రైతులకు కనీసం కట్ట యూరియా బస్తా కూడా దొరకని దుస్థితి. రైతు భరోసా కేంద్రాలకు రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చేసి నిర్వీర్యం చేశారు. 2 లక్షల టన్నుల మామిడి వృథాగా పోతే ప్రభుత్వం నిద్రపోతుందా? యాప్‌లో బుక్ చేస్తేనే రైతులకు ఎరువులు ఇస్తామని చెబుతున్నారు. కానీ కౌలు రైతులకు ఎలా తీసుకోవాలో చెప్పడం లేదు. రైతును ఈ ప్రభుత్వం పూర్తిగా రోడ్డున పడేసింది. అన్నదాత సుఖీభవ పథకాన్ని ఈ ఏడాది ఖచ్చితంగా కౌలు రైతులకు కూడా వర్తింపజేయాలి. కళ్లబొల్లి మాటలతో రైతులను వేధించడం మానుకోవాలి. యాప్ ద్వారా ఎరువులు పంపిణీ చేసే విధానాన్ని సరళతరం చేయాలని కురసాల కన్నబాబు డిమాండ్ చేశారు.

## నీట్ సూసైడ్ బాధిత కుటుంబాలకు కోటి పరిహారమివ్వండి

అయితే ఆ బాధిత కుటుంబీకులకు కోటి రూపాయలు పరిహారం ఇవ్వాలని కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే .. ఇవాళ ప్రధాని మోదీకి లేఖ రాశారు. ప్రవేశ పరీక్షల వివాదాల వల్ల ఆందోళనకు గురై ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారాన్ని ఇవ్వాలని దీప్కే డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణపై విద్యార్థుల్లో ఆందోళన నెలకొన్నదని, దీని వల్ల ఆ విద్యార్థుల మానసిక ఆరోగ్యం క్షీణిస్తున్నట్లు దీప్కే తన లెటర్‌లో ఆరోపించారు.మరో వైపు జూన్ 20వ తేదీన కాక్రోచ్ జనతా పార్టీ భారీ స్థాయిలో రెండో నిరసన ప్రదర్శనకు సిద్ధం అవుతున్నది. భారమైన హృదయంతో లేఖ రాస్తున్నానని, మన భవిష్యత్తుకు ప్రమాదకరంగా మారిన ఈ అంశంపై మీరు తక్షణమే స్పందించాలని దీప్కే తన లేఖలో ప్రధానిని కోరారు. మన విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని వేడుకున్నారు. ఇటీవల దేశవ్యాప్తంగా 11 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. రీ-ఎగ్జామ్‌పై అపనమ్మకం ఏర్పడడం వల్ల విద్యార్థుల్లో ఆందోళన ఎక్కువైందన్నారు. జీవితం మొత్తం కష్టపడి పిల్లలను చదివిస్తే, ఆ కుటుంబాలు ఇప్పుడు పిల్లల్ని కోల్పోతున్నాయని దీప్కే తన లెటర్‌లో ఆరోపించారరు.పరీక్షల వత్తిడి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారంగా కోటి ఇవ్వాలని దీప్కే డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలని కోరారు. మరో వైపు జూన్ 21వ తేదీన నీట్-రీఎగ్జామ్‌ను నిర్వహించనున్న విషయం తెలిసిందే.

## కూటమి ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం

శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన ఈ రెండేళ్లలో సూపర్ సిక్స్ హామీలు విజయవంతంగా అమలు చేశామన్నారు. మిగిలిన సంక్షేమ కార్యక్రమాలు దశలవారీగా పూర్తి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. శుక్రవారం శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో 'కూటమి ప్రభుత్వం రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి' కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. శ్రీకాకుళం జిల్లాకు మణి హారమైన మూలపేట పోర్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలో రాష్ట్రం ప్రగతిపథంలో ముందుకు సాగుతుందని అన్నారు. నేరడి బ్యారేజ్ అంతర్రాష్ట్ర వివాద పరిష్కారానికి కేంద్రంతో చర్చించి గెజిట్ నోటిఫికేషన్ సాధించామని వివరించారు.జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయటానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉందని చెప్పారు. అందువల్ల దేశంలో వచ్చే పెట్టుబడుల్లో 25 శాతం ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్నాయని తెలిపారు. దీంతో రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ధీమా వ్యక్తం చేశారు.

## నాసిరకం మందుల చెలామణిపై ఉక్కుపాదం మోపాలి

మార్కెట్ లోని మందుల దుకాణాలు, తయారీ సంస్థల నుంచి సేకరించే మందుల శాంపిళ్లు (నమూనాలు) బాగా పెరిగాయని, నిఘా వ్యవస్థను పటిష్టం చేస్తోన్నందున నాణ్యత లేని మందుల చెలామణి క్రమంగా తగ్గుముఖం పట్టిందని తెలిపారు. సౌకర్యాలు మెరుగుపరచినందున తనిఖీ యంత్రాంగాన్ని మరింత పటిష్టం చేసి నాసిరకం మందుల చెలామణిని పూర్తిస్థాయిలో సకాలంలో ఉక్కుపాదంతో అణగదొక్కాలని అధికారులకు పిలుపునిచ్చారు. ప్రజారోగ్య సంరక్షణ విషయంలో ప్రభుత్వం రాజీ పడదని, వారి జీవన ప్రమాణాల్ని మెరుగుపరచేందుకు అధిక ప్రాధాన్యమిస్తుందని చెప్పారు.విజయవాడలో నూతనంగా నిర్మించిన రాష్ట్ర ఔషధ పరీక్ష ప్రయోగశాల, ఔషధ నియంత్రణ ప్రధాన కార్యాలయాన్ని శుక్రవారం మంత్రి శ్రీ సత్యకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల డ్రగ్ ల్యాబ్స్ అవసాన దశకు చేరుకున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక విశాఖపట్నం, కర్నూలులో కొత్త ల్యాబ్ లను అందుబాటులోకి తెచ్చామన్నారు. విజయవాడలోని ల్యాబ్‌ను రాష్ట్ర స్థాయి ల్యాబ్‌గా తీర్చిదిద్దామన్నారు. రెండేళ్లకు ముందు ఏడాదికి 4వేల శాంపిళ్లను పరీక్షించేవారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన అనంతరం అదనంగా 800 నమూనాలను పరీక్షించడం మొదలైందన్నారు. అన్ని సౌకర్యాలతో రాష్ట్ర స్థాయి ల్యాబ్ గా విజయవాడ ల్యాబ్‌ను అప్‌గ్రేడ్ చేసినందున ఏడాదికి 13వేల నమూనాలను పరీక్షించేందుకు అవకాశం ఏర్పడిందని తెలిపారు. ఇందుకు అనుగుణంగా కొత్త పోస్టుల ఆవశ్యకతను గుర్తించామని, ఆర్థిక శాఖతో సంప్రదించి సాధ్యమైనంత త్వరగా నియామకాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

# బలమైన రాష్ట్రాలే బలమైన దేశాన్ని నిర్మిస్తాయి.. మాకు ఇగోలు లేవు

జరిగిన ఈ సదస్సులో లోకేశ్ తన ప్రసంగంతో పెట్టుబడిదారులను ఆకట్టుకున్నారు.ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, "ఈ రోజు బెంగాల్ ఏది ఆలోచిస్తుందో, రేపు భారత్ అదే ఆలోచిస్తుందని చిన్నప్పటి నుంచి వింటూ పెరిగాను. భారతదేశ మేధో, సాంస్కృతిక, ఆర్థిక ప్రయాణానికి కోల్‌కతాయే రాజధానిగా నేను భావిస్తాను. బలమైన బెంగాల్ అంటే బలమైన భారతదేశం అని నేను గట్టిగా నమ్ముతున్నాను" అని అన్నారు. అంతకుముందు రోజు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రితో సమావేశమైన విషయాన్ని గుర్తుచేసుకుంటూ, అభివృద్ధి పట్ల ఆమె అంకితభావం తనకు స్ఫూర్తినిచ్చిందన్నారు. రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉంటేనే దేశం పురోగమిస్తుందని, అదే సమయంలో రాష్ట్రాలు పరస్పరం సహకరించుకుని తమ బలాలను పెంచుకోవాలని అభిప్రాయపడ్డారు. భూమి అనేది భారతీయులకు భావోద్వేగంతో కూడిన అంశమైనప్పటికీ, అమరావతిలో ల్యాండ్ పూలింగ్ ద్వారా రైతులను ఎలా ఒప్పించగలిగామో పశ్చిమబెంగాల్ సీఎంకు వివరించినట్లు తెలిపారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం స్థిరత్వంతో ముందుకు సాగుతోందని, ఆయన అమలు చేస్తున్న సంస్కరణలను అందిపుచ్చుకోవడంలో ఆంధ్రప్రదేశ్ ముందు వరుసలో ఉందని లోకేశ్ స్పష్టం చేశారు. దేశానికి వస్తున్న మొత్తం పెట్టుబడులలో 25 శాతం ఏపీకే వస్తున్నాయని గుర్తుచేశారు.పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ విజయానికి మూడు 'ఎస్'లే (గూగా) కారణమని వివరించారు. మొదటిది 'స్పీడ్' (వేగం) అని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దశను దాటి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అమలు చేస్తున్నామని తెలిపారు. 13 నెలల్లోనే గూగుల్ వంటి అతిపెద్ద విదేశీ పెట్టుబడిని సాధించడం, ఒకే జూమ్ కాల్‌తో ఆర్సెలార్ మిట్టల్ ప్రాజెక్టును ఖరారు చేయడం, పుట్టపర్తిలో 37 రోజుల్లో 600 ఎకరాలు సేకరించి శంకుస్థాపన చేయడం తమ వేగానికి నిదర్శనమన్నారు.రెండోది 'స్టెబిలిటీ' (స్థిరత్వం) అని, విధానాల్లో స్థిరత్వాన్ని కొనసాగిస్తూ పారిశ్రామికవేత్తలకు భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. మూడోది 'సర్వీస్' (సేవ) అని, ప్రభుత్వాలను నియంత్రణ సంస్థలుగా కాకుండా సేవలందించే భాగస్వాములుగా తాము భావిస్తామన్నారు. "కస్టమర్ ఈజ్ గాడ్ అనే మార్వాడీల స్ఫూర్తితో మీకు సేవ చేసేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. మీరు మా కస్టమర్లు" అని పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి అన్నారు.

మాకు ఎలాంటి ఇగోలు లేవు

2047 నాటికి ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నామని లోకేశ్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉన్న ట్రాక్ రికార్డు, ఆయన దార్శనికతతో ఇది సాధ్యమవుతుందన్నారు. జులైలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించనున్నామని, మంగళగిరిలో జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్క్ నిర్మిస్తామని ప్రకటించారు. ఏపీలో యువశక్తితో కూడిన కొత్త కేబినెట్ ఉందని, తామంతా ఎలాంటి ఇగోలు లేకుండా రాష్ట్ర అభివృద్ధి కోసం కసితో పనిచేస్తున్నామని అన్నారు. "నేను మీకు కేవలం ఒక వాట్సాప్ దూరంలోనే ఉన్నాను. మీ ప్రాజెక్టును మా ప్రాజెక్టుగా భావించి పూర్తిచేస్తాం. మనమంతా కలిసి పనిచేసి, బలమైన రాష్ట్రాల ద్వారా బలమైన భారతదేశాన్ని నిర్మిద్దాం" అని లోకేశ్ తన ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో ఐసీసీ ప్రెసిడెంట్ బ్రిజ్ భూషణ్ అగర్వాల్, ఉపాధ్యక్షుడు కేశవ్ భజంక, ఇతర ప్రముఖ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామిక, తయారీ రంగ కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, ఇందుకు పారిశ్రామికవేత్తలు సహకరించాలని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ఆయన కోల్‌కతాలో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలతో సమావేశమై రాష్ట్రంలో ఉన్న అవకాశాలను వివరించారు.కోల్‌కతాలో వీసా స్టీల్ వైస్ చైర్మన్ విశాల్ అగర్వాల్, ఇమామీ గ్రూప్ డైరెక్టర్ ఆదిత్య అగర్వాల్, శ్రీ సిమెంట్స్ వైస్ చైర్మన్ ప్రశాంత్ బంగూర్‌లతో లోకేశ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక సంస్కరణలు దేశాభివృద్ధికి దోహదపడుతున్నాయని ప్రశంసించారు. దీనికి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి కల్పన కోసం వ్యూహాత్మక విధానాలను అమలు చేస్తున్నామని తెలిపారు.తూర్పు తీరంలో ఆంధ్రప్రదేశ్ కీలక ఆర్థిక భాగస్వామిగా ఎదుగుతోందని లోకేశ్ పేర్కొన్నారు. రాష్ట్రానికి ఉన్న విస్తారమైన తీరప్రాంతం, ప్రపంచ స్థాయి ఓడరేవులు, మెరుగైన లాజిస్టిక్స్, పరిశ్రమలకు అవసరమైన భూమి, నిరంతర విద్యుత్ లభ్యత వంటి అంశాలు పెట్టుబడులకు అత్యంత అనుకూలంగా ఉన్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఇన్వెస్టర్-ఫ్రెండ్లీ పాలసీలు పరిశ్రమల స్థాపనను సులభతరం చేస్తున్నాయని తెలిపారు. దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక పెట్టుబడులలో ఒకటైన 'ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్' ప్లాంట్ పనులు అనకాపల్లి వద్ద ఇప్పటికే ప్రారంభమయ్యాయని, దీంతో రాష్ట్రం ఉక్కు పరిశ్రమకు ప్రధాన కేంద్రంగా మారుతోందని ఉదహరించారు.ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తలు జాతీయ ఆర్థిక ధోరణులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రభుత్వ-పరిశ్రమల సహకారం వంటి అంశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. పెట్టుబడులను ఆకర్షించడంలో, పారిశ్రామిక వృద్ధిని ప్రోత్సహించడంలో ఏపీ ప్రభుత్వం అనుసరిస్తున్న చురుకైన విధానాన్ని వారు అభినందించారు. రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్న లోకేశ్ విజ్ఞప్తికి వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది.మూసీ పునరుజ్జీవనలో గాంధీ సరోవర్ ప్రాజెక్టు కీలక మైలురాయిగా భావిస్తున్నామని... మూసీ పరివాహక ప్రాంతాన్ని సాంస్కృతిక ప్రజా వారసత్వ ఆస్తిగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తేల్చిచెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా హైదరాబాద్‌లోని బాపూఘాట్ (ఈసీ, మూసీ నదుల సంగమ ప్రాంతం) వద్ద 'గాంధీ సరోవర్' ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా బాపూఘాట్ వద్ద సుమారు 150 మీటర్ల ఎత్తులో మహాత్మా గాంధీ భారీ విగ్రహం, మ్యూజియం, లండన్ ఐ తరహా రాట్నం, సైక్లింగ్ ట్రాక్‌లు, బోటింగ్ సదుపాయంతో పాటు పలు పర్యాటక ఆకర్షణలు అభివృద్ధి చేస్తున్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన డిజైనింగ్, డీపీఆర్ ఇదివరకే సిద్ధమయ్యాయి.తాజాగా పనుల నిర్వహణకు రక్షణ శాఖఅనుమతులు మంజూరు చేసింది. గోల్కొండ ఆర్టిలరీ సెంటర్ పరిధిలోని 83.818 ఎకరాల రక్షణ శాఖ భూమిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ భూమికి ఈ కీలకమైన క్లియరెన్స్ లభించడంతో బాపూఘాట్ వద్ద ప్రాజెక్టు నిర్మాణ పనులు మరింత వేగవంతం కానున్నాయి.

# విజయవాడ కస్టడీ డెత్: సీబీఐ విచారణ జరిపించాలి

ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఘటనను కప్పిపుచ్చేందుకు విజయవాడ పోలీస్ కమిషనర్, డీజీపీ స్థాయి అధికారులు ప్రయత్నిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు.గతంలో నేరచరిత్ర ఉన్న సాయికృష్ణను మే 9వ తేదీన మార్కాపురంలో కృష్ణలంక పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, అప్పటి నుంచి అతని ఆచూకీ తెలియలేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. తన కుమారుడిని పోలీసులు అక్రమంగా నిర్బంధించి చిత్రహింసలకు గురిచేశారని అతని తల్లి విజయలక్ష్మి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే, తాము సాయికృష్ణను అదుపులోకి తీసుకోలేదని, అతని కోసం గాలిస్తున్నామని పోలీసులు కోర్టుకు విన్నవించారు.ఈ కేసుపై విచారణ చేపట్టిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, పోలీసుల వాదనలపై సందేహాలు వ్యక్తం చేసింది. జూన్ 29లోగా సాయికృష్ణను కోర్టు ముందు హాజరుపరచాలని, లేనిపక్షంలో సంబంధిత అధికారులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించింది. ఈ పరిణామాల నేపథ్యంలో, ప్రభుత్వం కృష్ణలంక సీఐ నాగరాజును సస్పెండ్ చేసి, ఒక సీనియర్ ఐపీఎస్ అధికారితో ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది.ఈ ఘటనకు బాధ్యులైన వారిపై తక్షణమే హత్య కేసు నమోదు చేయాలని జగన్ డిమాండ్ చేశారు. టీడీపీ ప్రభుత్వం ఈ విషయాన్ని నిర్లక్ష్యం చేస్తోందని ఆయన విమర్శించారు. విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో లాకప్‌డెత్‌కు గురైన గిగ్ వర్కర్ సాయికృష్ణ కేసులో సీబీఐ దర్యాప్తు జరగాలని, అందుకు బాధ్యులైన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కేసులో విజయవాడ కమిషనర్‌తో పాటు, రాష్ట్ర డీజీపీకి కూడా ప్రమేయం ఉందన్నారు. కేవలం కంటి తుడుపుగా సీఐని సస్పెండ్ చేశారని, విజయవాడ సీపీ, డీజీపీతో సహా బాధ్యులందరిపై మర్డర్ కేసు పెట్టి శిక్షించాలని తేల్చి చెప్పారు. విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో లాకప్‌డెత్‌కు గురైన గాదె సాయికృష్ణ తల్లి, కుటుంబ సభ్యులను గురువారం ఆయన పరామర్శించారు. కృష్ణలంకలో ఉంటున్న వారి ఇంటికి వెళ్లి జరిగిన దారుణం గురించి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన అక్కడే మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏం మాట్లాడారంటే..విజయవాడ నడిబొడ్డున, అంటే రాష్ట్రానికి రాజధాని ప్రాంతం. ఇక్కడి నుంచి కూతవేటు దూరంలోనే ముఖ్యమంత్రి నివాసం. ఇక్కడి నుంచి కూతవేటు దూరంలోనే డీజీపీ కార్యాలయం. విజయవాడలోనే కమిషనరేట్ కూడా ఉంది. ఇక్కడే ఏసీపీ పరిధి. ఇదే పరిధిలోనే కృష్ణలంక పోలీసు స్టేషన్ ఉంది. ఇదే పోలీసు స్టేషన్ పరిధిలోనే ఈ తల్లి (జగన్ పక్కనే ఉన్న సాయికృష్ణ తల్లి) ఎంత దారుణంగా ఈ ఘటన జరిగిందో చెబుతూ రోదిస్తున్న దృశ్యం కనిపిస్తోంది. ప్రతి ఒక్కరినీ ఒకటే ఆలోచన చేయమని అడుగుతున్నా. చంద్రబాబు నాయుడు దగ్గరుండి ప్రోత్సహిస్తున్న కొంత మంది పోలీసులు, వీరు చేసే పనుల వల్ల ఈ రాష్ట్రంలో ఏదైనా అన్యాయం జరిగితే పోలీసు స్టేషన్‌కు వెళ్లడానికి భయపడే పరిస్థితి నెలకొంది. అలా ఈ రాష్ట్రంలో పరిపాలన సాగుతోంది. అందరూ కూడబలుక్కుని ఒకరినొకరు ఎలా వెనకేసుకు వస్తున్నారో చెప్పడానికి ఇదే నిదర్శనం. 'పోలీసులు చెబుతున్నట్లు నా కొడుకు దోపిడీలు, దొంగతనాలు చేసి కోట్లు గడిస్తే, ఒక గిగ్ వర్కర్‌గా ఎందుకు పని చేస్తాడు బాబూ..' అని ఆ తల్లి తన గోడు వెళ్లబోసుకుంది. ఆ కుటుంబం పరిస్థితి అంత దారుణంగా ఉంది.అన్న పోలీసులు ఆ రోజు (మే 9) నుంచే సాయికృష్ణ తల్లి పోలీసుస్టేషన్ చుట్టూ తిరిగితే, 'నీ కొడుకు ఫొటోకు దండ వేసుకో..' అంటూ ఈ తల్లిని సీఐ హేళనగా మాట్లాడారు. ఆ రోజు నుంచి ప్రతి రోజూ ఆ స్టేషన్‌లో జరుగుతున్న విషయాల మీద మిగతా వాళ్లు సమాచారం ఇస్తుంటే, తన కుమారుడిని పోలీసులు చిత్రహింసలు పెడుతున్నారని ఆ తల్లికి అర్థమైంది. దీంతో ప్రతి రోజూ అదే పోలీసు స్టేషన్‌కు వెళ్లి నా కొడుకును నాకు చూపించమని బాధ పడిన పరిస్థితులు మన కళ్లెదుటే కనిపిస్తున్నాయి. ఈ ఘటన మీద ఈ తల్లితో పాటు చిన్నమ్మ అయిన లాయర్ డీజీపీ ఆఫీసుకు వెళ్లి రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు ఏమైంది? చివరికి చెత్త బుట్టలోకి వెళ్లింది. డీజీపీ ఫిర్యాదును సీపీకి పంపించడం, సీపీ యాక్షన్ తీసుకోకుండా మిగతా వాళ్లను పిలిపించి బేరం పెట్టించే కార్యక్రమం చేశారు. అప్పుడు కోర్టు జోక్యం చేసుకోవడంతో పాటు, మన లాంటి వాళ్లంతా ఆ తల్లికి అండగా నిలబడితే గత్యంతరం లేక ఈ రోజు సీఐపై చర్యలు తీసుకున్నారు. చంపేశాడనే కదా సీఐని సస్పెండ్ చేసింది! అంటే ఒకే పోలీసు స్టేషన్లోనే, ఆ సీఐని కాపాడుతూ ఏసీపీ, ఏసీపీని కాపాడుతూ కమిషనర్, కమిషనర్‌ను కాపాడుతూ డీజీపీ.. ఇలా అందరికీ తెలిసి ఆ స్టేషన్లో జరిగింది ఒక హత్య మాత్రమే కాదు.

# కృష్ణలంక పోలీస్ స్టేషన్ సీసీ టీవీ ఫుటేజ్‌లన్నీ విడుదల చేయాలి

కారణంగానే ఈ దారుణాలు జరుగుతున్నాయని పశ్చిమ గోదావరి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ధ్వజమెత్తారు. విశాఖలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సిటీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కేసులో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, హోంమంత్రి అనితలను కూడా నిందితులుగా చేర్చాలని డిమాండ్ చేశారు. సీఐ నాగరాజుపై హత్యాయత్నం కేసు నమోదు చేశారంటే సాయికృష్ణ బతికే లేదని, చంపేసినట్టు ప్రభుత్వం ఒప్పుకున్నట్టేనని, సీఐని బలిచేసి మిగతా పోలీసు ఉన్నతాధికారులను తప్పించే కుట్ర జరుగుతోందని అనుమానం వ్యక్తం చేశారు. కేసును నీరుగార్చి తప్పించుకునే కుట్రలో భాగంగానే ఐజీ స్థాయి అధికారులపై విచారణకు ఎస్పీని నియమించారని వివరించారు. ఆ తల్లికి న్యాయం జరగాలన్నా, ఈ దారుణంతో సంబంధం ఉన్న వారందరికీ శిక్ష పడాలన్నా సీబీఐతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఏ తప్పూ చేయనట్టయితే కృష్ణలంక పోలీస్ స్టేషన్ సీసీ టీవీ ఫుటేజ్‌లన్నీ విడుదల చేయాలని గుడివాడ అమర్నాథ్ డిమండ్ చేశారు. కూటమి పాలన ఇలాగే కొనసాగితే రాష్ట్ర భవిష్యత్ తరాల పరిస్థితి ఏమైపోతుందోనన్న ఆవేదన కలుగుతోంది. గాదె సాయికృష్ణ అనే 23 ఏళ్ల యువకుడిని కృష్ణలంక పోలీసులు లాకప్‌లోనే అతి దారుణంగా హింసించి చంపేసిన దారుణం చూస్తే ఒళ్లు గగుర్పొడుస్తోంది. తన కొడుకుని చూపించమని పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతూ నెలరోజుల పాటు ఆ తల్లి పడిన కష్టం, ఇప్పుడు కొడుకు బతికి లేడని, ఆఖరి చూపు కూడా దక్కలేదని తెలిసి కన్నీరు మున్నీరవుతున్న తీరు చూస్తే ఎవరికైనా గుండె తరుక్కుపోతోంది. చివరికి న్యాయస్థానాన్ని ఆశ్రయించి హెబియస్ కార్పస్ పిటిషన్ వేస్తే తప్ప కొడుకు లేడన్న విషయమైనా ఇతర మార్గాల్లో వెలుగులోకి వచ్చింది. సీఐ నాగరాజుపై హత్యాయత్నం సెక్షన్ కింద పెట్టిన కేసుతో లాకప్‌లోనే చంపేశారని పోలీసులు, ప్రభుత్వం అంగీకరించినట్టయింది. లాకప్ లో హింసించి చంపడమే కాకుండా ఆఖరుకి బూడిద కూడా లేకుండా చేసిన దుర్మార్గం దేశంలో ఏ రాష్ట్రంలోనూ జరిగి ఉండదు. ఇటువంటి ప్రభుత్వాన్ని నడిపిస్తున్న చంద్రబాబు సిగ్గుపడాలి. లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగంతో రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా గాడి తప్పాయి. గాదె సాయికృష్ణ ఘటనతో రెడ్‌బుక్ అరాచకాలు పరాకాష్టకు చేరినట్టు కనిపిస్తోంది. రాష్ట్రంలో జంగిల్ రాజ్ పాలన సాగుతోంది.సాయికృష్ణకు గోర్లు పీకేసి తీవ్రంగా హింసించారని తెలుస్తోంది. అసలు నేరస్తులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి హక్కు పోలీసులకు ఎవరిచ్చారు? సాయికృష్ణ పట్ల సీఐ నాగరాజు వ్యవహరించిన తీరు దేశం ముందు ఏపీ పోలీస్ వ్యవస్థ తలదించుకునేలా ఉంది. చట్టాన్ని అతిక్రమించి కూటమి నాయకులకు వంతపాడే పోలీసులు ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలి. పొలిటికల్ బాస్‌ల ఆదేశాలతో కాకుండా చట్టప్రకారం నడుచుకోవాలి.

# సీఎం చంద్రబాబు అధ్యక్షతన 235వ ఎస్ఎల్‌బీసీ సమావేశం..

ఈ భేటీలో 2026-27 వార్షిక రుణ ప్రణాళికపై బ్యాంకర్లతో సీఎం చంద్రబాబు చర్చించారు. వ్యవసాయ రంగం, ఎంఎస్ఎంఈలు, స్వయం సహాయ సంఘాలు, కౌలు రైతులకు అందించిన రుణాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రంగానికి రూ.3,86,249కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబుకు బ్యాంకర్లు వివరించారు. ఎంఎస్ఎంఈ రంగానికి రూ.1,17,357కోట్లు, ప్రాధాన్య రంగానికి రూ.5,19,693కోట్ల రుణాలు అందించినట్లు వెల్లడించారు. దక్షిణ భారతదేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో రుణాల పంపిణీ 137 శాతం మేర ఉన్నట్లు సీఎం చంద్రబాబుకు తెలిపారు. ఈ సందర్భంగా బ్యాంకర్లకు ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. మరోవైపు రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు మరింత విస్తరించేలా సహకారం అందించాలని కోరారు.కాగా, ఎస్ఎల్‌బీసీ సమావేశానికి సీఎస్ సాయి ప్రసాద్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ, సీఈవో ఆశిష్ పాండే, కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ డైరెక్టర్ నీలమ్ అగర్వాల్, ఆర్బీఐ రీజినల్ డైరెక్టర్ ఏవో బషీర్, నాబార్డ్ జీఎం కేవీఎస్ ప్రసాద్, తదితరులు హాజరయ్యారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని సాయికృష్ణ కుటుంబసభ్యులు కలిశారు. ఈరోజు(శుక్రవారం) సాయికృష్ణ తల్లితో పాటు ఇతర కుటుంబసభ్యులను ఎమ్మెల్యే బోడెప్రసాద్ ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి తీసుకెళ్లారు. అనంతరం చంద్రబాబును సాయికృష్ణ కుటుంబసభ్యులు కలిశారు. తమకు న్యాయం చేయాలంటూ సాయికృష్ణ తల్లి కోరారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని సీఎం భరోసా ఇచ్చారు. సాయికృష్ణ అదృశ్యంపై ఉన్నతస్థాయి దర్యాప్తు చేయిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే సీఐని సస్పెండ్ చేసి, దర్యాప్తును వేగవంతం చేశామని వెల్లడించారు. తప్పు చేసినవారు ఎంతటివారైనా ఉపేక్షించబోమని సాయికృష్ణ తల్లికి ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు.సాయికృష్ణపై అనేక కేసులు ఉన్నాయి. ఇటీవల అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారనే వార్తలు వచ్చాయి. అయితే సాయికృష్ణ మిస్సయ్యాడంటూ పోలీసులు చెబుతున్నారు. పోలీసులే సాయికృష్ణను హతమార్చారని, లాకప్ డెత్ కింద కేసు నమోదు చేయాలని కుటుంబసభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. సీఐ నాగరాజును సస్పెండ్ చేయడంతో పాటు.. ఈ కేసుకు సంబంధించి సీనియర్ ఐపీఎస్ అధికారిని దర్యాప్తు అధికారిగా నియమించింది.రాష్ట్రంలోని రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు అన్నదాత సుఖీభవ నిధులు విడుదలకు కూటమి ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. శనివారం (జూన్ 20వ తేదీ) పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గంలోని లింగం గుంట్లలో జరిగే కార్యక్రమంలో ఈ నిధులను సీఎం చంద్రబాబు నాయుడు విడుదల చేయనున్నారు.

# మణికొండలో జనసేన కొత్త కార్యాలయాన్ని ప్రారంభించిన పవన్ కల్యాణ్

శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించిన అనంతరం నేతలు గృహప్రవేశం చేశారు. అంతకు ముందు పార్టీ కార్యాలయం ముందు జనసేన జెండాను ఎగురవేసిన పవన్ కల్యాణ్, పార్టీ శ్రేణులకు అభివాదం చేశారు. తెలంగాణలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేయడానికి, రాబోయే రోజుల్లో ప్రజల పక్షాన పోరాటాలు, పార్టీ సంస్థాగత కార్యకలాపాలను ముమ్మరం చేయడానికి ఈ నూతన కార్యాలయం ప్రధాన వేదికగా నిలవనుందని పార్టీ శ్రేణులు వెల్లడించారు. సరికొత్త హంగులతో సిద్ధమైన ఈ ఆఫీస్ ప్రారంభోత్సవం తో మణికొండ పరిసర ప్రాంతాల్లో జనసైనికుల కోలాహలం, సందడి నెలకొంది.రాష్ట్రంలో పచ్చదనాన్ని 50శాతానికి పెంచడమే లక్ష్యంగా 'గ్రీనింగ్ సొసైటీ' ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అటవీశాఖ అధికారులను ఆదేశించారు. జూలై 3వ తేదీ నాటికి సొసైటీ ఏర్పాటు ప్రక్రియ పూర్తి కావాలన్నారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో అటవీశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పవన్ మాట్లాడుతూ 'రాష్ట్రంలోని ప్రతి పంచాయతీలో ఒక నర్సరీ ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఒకే పంచాయతీలో సాధ్యం కాకపోతే.. 3-4 పంచాయతీలను క్లస్టర్‌గా చేసి, ఉమ్మడిగా ఒక నర్సరీని ఏర్పాటు చేయాలి. వీబీజీ రామ్‌జీ పథకానికి నర్సరీల పెంపకాన్ని కూడా అనుసంధానించాం. ఈ పథకం ద్వారా లభించే నిధులు, పని దినాలను సమర్థంగా వినియోగించుకుని, గ్రామీణ ప్రాంతాల్లో నర్సరీలను పెద్ద ఎత్తున అభివృద్ధి చేయాలి' అని చెప్పారు. ఈ వర్షాకాలంలో రాష్ట్రవ్యాప్తంగా అటవీ, ఖాళీ ప్రాంతాల్లో చల్లడానికి 2.6 కోట్ల సీడ్ బాల్స్ సిద్ధం చేసినట్లు అటవీ అధికారులు ఆయనకు చెప్పారు. విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజలను కలుపుకుని, దీనిని ఒక ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని పవన్ సూచించారు. అంతరిస్తున్న అరుదైన వృక్ష జాతులను రక్షించేందుకు అటవీ శాఖ తీసుకుంటున్న ప్రత్యేక చర్యలపై పవన్ హర్షం వ్యక్తం చేశారు.మంగళగిరిలోని ఎయిమ్స్ సమీపంలో 'అరణ్యారామం' పేరుతో అటవీశాఖ నిర్మించనున్న కామన్ ఫెసిలిటీ భవనానికి శుక్రవారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేయనున్నారు. కార్యక్రమంలో మంత్రి లోకేశ్ పాల్గొననున్నారు .బాయిబాట కార్యక్రమంలో భాగంగా కల్వకుంట్ల కవిత అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్టు అండర్‌గ్రౌండ్ మైన్‌లోకి దిగి కార్మికులతో ముఖాముఖి మాట్లాడారు. నల్లబొగ్గు బావుల్లో కార్మికులు పడుతున్న కష్టాలను, ప్రాణసంకట పరిస్థితులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒక కార్మికుడు తను అనుభవిస్తున్న ఇబ్బందులను వివరిస్తుండగా కవిత తీవ్ర చలనానికి లోనై మైన్ లోపలే కంటతడి పెట్టారు. కార్మికులకు తాము ఎల్లప్పుడూ తోడుగా ఉంటామని, హక్కుల సాధన కోసం పోరాడుతామని భరోసానిచ్చారు.అనంతరం బొగ్గు గని వద్ద నిర్వహించిన భారీ గేట్ మీటింగ్‌లో కవిత మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై, సింగరేణి యాజమాన్యంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఉత్తర తెలంగాణకు ఆర్థిక వెన్నెముకగా నిలిచిన సింగరేణి సంస్థకు ప్రస్తుత ప్రభుత్వమే పెద్ద విద్రోహిగా మారిందని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి దాదాపు రూ. 50 వేల కోట్ల బకాయిలు పెట్టడం వల్లే సంస్థ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిందని ఆరోపించారు. అధికారులకు ప్రొడక్షన్ టార్గెట్లు పెంచడంపై ఉన్న శ్రద్ధ... కార్మికులకు కనీస సౌకర్యాలు, ఆధునిక పనిముట్లు కల్పించడంపై లేదని మండిపడ్డారు."అండర్‌గ్రౌండ్ మైనింగ్‌లో మెషినరీని అప్‌గ్రేడ్ చేయడం లేదు.

## మొహర్రం పండుగను శాంతియుతంగా జరుపుకోవాలి



ఎస్సై అనిల్ కుమార్

**ప్యాపిలి జూన్ 19 (సీమ కిరణం న్యూస్) :** మొహర్రం పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్సై అనిల్ కుమార్ సూచించారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ప్యాపిలి మండలంలోని జలదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో గల జక్కసానికుంట్ల గ్రామంలో మొహర్రం పండుగను శాంతియుతంగా, సామరస్య వాతావరణంలో నిర్వహించేందుకు గ్రామ పెద్దలు, ముజావర్లు మరియు ప్రజలతో పోలీసులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పండుగ సందర్భంగా ప్రతి ఒక్కరూ పోలీసు శాఖ సూచనలను పాటించాలని కోరారు. మొహర్రం వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు ఇవ్వకుండా పరస్పర సహకారంతో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డీజేలు, శబ్ద కాలుష్యానికి కారణమయ్యే కార్యక్రమాల విషయంలో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఊరేగింపుల సమయంలో యువత క్రమశిక్షణతో వ్యవహరించాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని కోరారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని, ఏదైనా అనుమానాస్పద పరిస్థితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై సూచించారు. గ్రామ పెద్దలు కూడా మొహర్రం పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

## రైతులకు శాశ్వత సాగునీటి భద్రతే లక్ష్యం ఎమ్మెల్యే కోట్ల







**డోన్ టౌన్, జూన్ 19,(సీమ కిరణం న్యూస్):** డోన్ మండలంలోని కొత్తబుర్జు గ్రామ సమీపంలో ఉన్న తిప్పమ్మ కుంట మరియు వెంగళం కుంటలను డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెరువుల ప్రస్తుత పరిస్థితి, నీటి నిల్వ సామర్థ్యం, అభివృద్ధి పనుల అవసరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, డోన్ నియోజకవర్గంలోని రైతాంగానికి సాగునీటి ఇబ్బందులు లేకుండా చేయడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. వర్షపు నీటిని పూర్తిస్థాయిలో నిల్వ చేసుకునే విధంగా చెరువుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. చెరువుల పునరుద్ధరణ ద్వారా భూగర్భ జలాలు పెరిగి రైతులకు, గ్రామ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, నియోజకవర్గ అభివృద్ధిలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రతి గ్రామం అభివృద్ధి బాటలో ముందుకు సాగేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

## డోన్ లో ఎంఈఓ కు జర్నలిస్టుల వినతిపత్రం




**డోన్ టౌన్, జూన్ 19,(సీమ కిరణం న్యూస్):** డోన్ అక్రిడిటేషన్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (డి ఏ డబ్ల్యు జే యు) ఆధ్వర్యంలో డోన్ ఎంఈఓకు రవి నాయక్ వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా డిప్యూటీ డి ఓ కు మేల్ వాట్సాప్ ద్వారా ఈ లెటర్ అందజేశాం. జర్నలిస్టుల పిల్లలకు విద్యా రంగంలో ప్రత్యేక రాయితీలు, 100 శాతం ఫీజు రాయితీ, ఉచిత విద్యా సామగ్రి అందించాలని కోరారు. అలాగే పాఠశాలలు, కళాశాలల్లో అడ్మిషన్లలో ప్రాధాన్యత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల కుటుంబాల సంక్షేమం కోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని యూనియన్ నాయకులు కోరారు.

## జిల్లా ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీ





ఎమ్మెల్యే కోట్ల

**ప్యాపిలి జూన్ 19 (సీమ కిరణం న్యూస్):** ప్యాపిలి మండలంలోని చిన్న పుద్దిళ్ల జిల్లా ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యా బోధన, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలు, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులతో మమేకమైన ఎమ్మెల్యే వారి విద్యాభ్యాసం, పాఠశాలలో ఉన్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. పాఠశాలలో ఉన్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# రమ్య సాధించిన విజయం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆదర్శం






ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డి

**ప్యాపిలి జూన్ 19 (సీమ కిరణం న్యూస్) :** రమ్య సాధించిన విజయం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. ప్యాపిలి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2026 ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో నంద్యాల జిల్లా స్థాయిలో టాపర్‌గా నిలిచిన విద్యార్థిని జి. రమ్యతో పాటు ప్రతిభ కనబరిచిన ఇతర విద్యార్థులను ఎమ్మెల్యే కోట్ల ఘనంగా సన్మానించారు. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరచడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోట్ల, రమ్యకు శాలువా కప్పి జ్ఞాపిక అందజేసి అభినందించారు. అలాగే ఉత్తమ ఫలితాలు సాధించిన ఇతర విద్యార్థులను కూడా సత్కరించి వారి కృషిని ప్రశంసించారు. విద్యార్థులు లక్ష్యసాధన కోసం కష్టపడి చదవాలని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు కూడా ఉన్నత ఫలితాలు సాధించి జిల్లాకు పేరు తీసుకురావడం గర్వకారణమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రమ్య సాధించిన విజయం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు మాట్లాడుతూ విద్యార్థుల విజయానికి ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం, విద్యార్థుల పట్టుదల కారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# డోన్ లో 83 వార్డులలో వైసిపి ఓటర్ల వెరిఫికేషన్





**డోన్ టౌన్, జూన్ 19,(సీమ కిరణం న్యూస్):** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి నాయకత్వంలో డోన్ పట్టణంలో ఓటర్ల జాబితా ప్రత్యేక పరిశీలన (సార్ వెరిఫికేషన్) కార్యక్రమం నిర్వహించారు. ఓటర్ల వివరాల్లో ఎలాంటి లోపాలు లేకుండా ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పార్టీ నాయకులు తెలిపారు. పట్టణంలోని 83వ బూత్ పరిధిలో ఉన్న సుందర్ సింగ్ కాలనీ, టీచర్స్ కాలనీల్లో గురువారం ప్రత్యేకంగా ఓటర్ల జాబితా వెరిఫికేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవల్ ఆఫీసర్ (బి ఎల్ వో) దేవేంద్ర నాయక్‌తో పాటు బూత్ లెవల్ ఏజెంట్లు (బి ఎల్ ఏ) ఆదాం, టీడీపీ తరపున ఖాదర్ బాషా పాల్గొని ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల పేర్లు, చిరునామాలు, ఇతర వివరాలను పరిశీలించడంతో పాటు జాబితాలో ఉన్న తప్పులు, మార్పులు, చేర్పులపై అవగాహన కల్పించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే ఇప్పటికే నమోదైన ఓటర్లు తమ వివరాలను ఒకసారి తప్పనిసరిగాధృవీకరించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి పౌరుడు తన ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకునేందుకు ఓటర్ల జాబితాలో వివరాలు సరిగా ఉన్నాయోలేదోపరిశీలించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా, తప్పుల్లేకుండా ఉండేందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమం మరికొన్ని రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు.

# డోన్ లో బిజెపి సంక్షేమ పథకాలు

## ఎగ్జిబిషన్ స్టాండ్ ను ప్రారంభించిన డోన్ డిఎస్పి శ్రీనివాసులు







**డోన్ టౌన్, జూన్ 19,(సీమ కిరణం న్యూస్):** భారతదేశ ప్రధానిగా నరేంద్ర మోడీ ప్రమాణస్వీకారం చేసి 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సేవ, సుపరిపాలన కార్యక్రమాలను దేశవ్యాప్తంగా మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియచేసే విధంగా బిజెపి,బిజెపి యువ మోర్చ నాయకులు నంద్యాల జిల్లా ఆధ్వర్యంలో ప్రత్యేక "మోదీ వికాస్ ప్రదర్శన" కార్యక్రమాన్ని డోన్ పట్టణంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం బీజేవైఎమ్ నంద్యాల జిల్లా అధ్యక్షులు సిలవరి వెంకటేష్ అధ్యక్షతన జరుగగా , ముఖ్య అతిథిగా డోన్ డీఎస్పీ శ్రీనివాసులు , అలాగే బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సందు వెంకట రమణ, ప్రధాన కార్యదర్శి కిరణ్, మరియు జిల్లా యువ మోర్చ నాయకులతో కలిసి నిర్వహించడం జరిగింది. జిల్లా యువ మోర్చ అధ్యక్షులు సిలవరి వెంకటేష్ మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే కూటమి ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, జల జీవన్ మిషన్ , ఆయుస్మాన్ భారత్ ఇలా ఎన్నో సంక్షేమ పథకాలను అన్ని రకాల వర్గాల కోసం అమలు చేస్తుందని పేర్కొన్నారు. డోన్ అసెంబ్లీ బిజెపి యువ నాయకులు, నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ నంద్యాల జిల్లా చైర్మన్ కొట్టె మల్లికార్జున మీడియాతో మాట్లాడుతూ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్, నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు అన్న సూచనతో మరియు యువ మోర్చ అధ్యక్షులు సిల్వరి వెంకటేష్ అధ్యక్షతన డోన్ అసెంబ్లీ డోన్ పట్టణంలో జిల్లా యువ మోర్చ నాయకులు, బిజెపి నాయకులతో కలిసి నిర్వహించడం జరిగింది. నరేంద్ర మోడీ సారథ్యంలో వికసిత భారత్ వికసిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యం కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సంక్షేమ పథకాలతో ఉన్న ఎగ్జిబిషన్ స్టాల్ ఏర్పాటు చేసి ,స్థానిక ప్రజలకు మోదీ సర్కారు పరిపాలన నిర్ణయాలు తెలియచేయడం జరిగిందని కొట్టె మల్లికార్జున మీడియాతో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి యువ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శులు విజయ భాస్కర్, బుగ్గన కావ్య, ఉపాధ్యక్షులు భవాని, సందు అరుణ్ కుమార్, కార్యదర్శి వసంత్ కుమార్, ట్రెజరర్ కమలేష్, బీజేవైఎమ్ ప్యాపిలి మండలం అధ్యక్షులు కేశవ్, ఇతర బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## ప్రాణాలతో పోరాడుతున్న చిన్నారి మోహిత్‌కు చేయూతనివ్వండి

మీ చిన్న సహాయం.. మోహిత్‌కు కొత్త జీవితం



**వెల్దుర్తి / క్రిష్ణగిరి, జూన్ 19, (సీమకిరణం న్యూస్) :** కర్నూలు జిల్లా కృష్ణగిరి మండలానికి చెందిన మూడేళ్ల చిన్నారి మోహిత్ ఆచారి అరుదైన జన్యుపరమైన వ్యాధితో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యుల నిర్ధారణ ప్రకారం చిన్నారికి బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్ చేయాల్సి ఉందని, ఇందుకోసం సుమారు రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. చిన్నారి తండ్రి కమ్మరి హరిశంకర్ నిరుపేద రైతు కుటుంబానికి చెందినవారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉండటంతో అంత పెద్ద మొత్తంలో వైద్య ఖర్చులను భరించడం వారికి సాధ్యం కావడం లేదు. అయినప్పటికీ తమ కుమారుడి ప్రాణాలను కాపాడేందుకు వారు శక్తివంచన లేకుండా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చిన్నారి మోహిత్‌కు అవసరమైన వైద్య సహాయం అందించేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు, మానవతావాదులు ముందుకు రావాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలు అందిస్తే చిన్నారి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మంచి మనసుతో సహాయం చేయాలనుకునే వారు ఫోన్‌పే / గూగుల్‌పే నంబర్: 7093382745 (కమ్మరి హరిశంకర్) కు తమ విరాళాలను పంపించి చిన్నారికి అండగా నిలవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. "చిన్న సహాయం... ఒక చిన్నారి జీవితానికి పెద్ద ఆశగా మారవచ్చు" అని మానవతావాదులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## తల్లిదండ్రులు క్రమశిక్షణ పాటిస్తే విద్యార్థులు కూడా పాటిస్తారు : డాక్టర్ శంకర్ శర్మ





**కల్లూరు, జూన్ 19, (సీమకిరణం న్యూస్)** అంతర్జాతీయ ఒలింపిక్ డే రన్ సందర్భంగా జిల్లా ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో అంతర్ పాఠశాలల విద్యార్థులకు కబడ్డీ పోటీలను నిర్వహించారు. నగరంలోని అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన ఈ పోటీలను ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు డాక్టర్ శంకర్ శర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో పాల్గొనడం సంతోషకరమైన విషయమన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణను కూడా పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ముఖ్యంగా ఇంట్లో తల్లిదండ్రులు మంచి అలవాట్లు, క్రమశిక్షణ పాటిస్తే విద్యార్థులు కూడా వాటినే అనుసరిస్తారని తెలిపారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పిల్లలతో సోషల్ మీడియాలో రీల్స్ చేయించడం కంటే వారి చదువు, క్రీడలు, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించాలని హితవు పలికారు. విద్యార్థులు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంటూ పౌష్టికాహారం, తాజా పండ్లు తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం ప్రతినిధులు నాగరత్నమయ్య, అవినాష్, సుబాకర్, కృష్ణ, మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఐ-ఫోన్ 16 సిరీస్ ఫోన్ల ప్రీ ఆర్డర్స్ షురూ రూ.5000 వరకూ క్యాష్ బ్యాక్ ఇవీ డిటైల్స్



ఆపిల్ ఇటీవల మార్కెట్లో ఆవిష్కరించిన ఐ-ఫోన్ 16 సిరీస్ ఫోన్లపై భారత్ కస్టమర్లు ప్రీ ఆర్డర్ బుక్ చేసుకోవచ్చు. టోకెన్ సొమ్ము చెల్లించి భారతీయ యూజర్లు ఐ-ఫోన్ 16 సిరీస్ ఫోన్లు బుక్ చేసుకోవచ్చు. ఐ-ఫోన్ 16, ఐ-ఫోన్ 16 ప్లస్, ఐ-ఫోన్ 16 ప్రో, ఐ-ఫోన్ 16 ప్రో మ్యాక్స్ ఫోన్ల విక్రయాలు ఈ నెల 20 నుంచి ప్రారంభం అవుతాయి. కొత్త ఐ-ఫోన్ మోడల్ స్మార్ట్ ఫోన్లపై ఆథరైజ్డ్ థర్డ్ పార్టీ రిటైలర్లు డిస్కౌంట్లు, క్యాష్ బ్యాక్ ఆఫర్లు ప్రకటించాయి.ఐ-ఫోన్ 16 ఫోన్ 128 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.79,900 పలుకుతుంది. ఐ-ఫోన్ 16 ప్లస్ ఫోన్ 128 జీబీ స్టోరేజీ వేరియంట్ 89,900 నుంచి మొదలవుతుంది. ఈ ఫోన్లు బ్లాక్, పింక్, టీల్, అల్ట్రా మెరైన్, వైట్ కలర్ ఆప్షన్లలో లభిస్తుంది. మరోవైపు ఐ-ఫోన్ 16 ప్రో ఫోన్ 128 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.1,19,900, ఐ-ఫోన్ 16 ప్రో మ్యాక్స్ ఫోన్ 256 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.1,44,900 పలుకుతున్నాయి. ఈ ఫోన్లు బ్లాక్ టైటానియం, డసర్ట్ టైటానియం, నాచురల్ టైటానియం, వైట్ టైటానియం కలర్ ఆప్షన్లలో లభిస్తాయి.ఆపిల్ ఐ-ఫోన్ యూజర్లు ఆపిల్ వెబ్ సైట్ ద్వారా గానీ, ముంబైలోని ఆపిల్ బీకేసీ, ఢిల్లీలోని ఆపిల్ సాకేత్ స్టోర్లలో గాని ప్రీ ఆర్డర్ బుక్ చేసుకోవచ్చు. కస్టమర్ల డిమాండ్, గిరాకీని బట్టి డెలివరీకి ఈ నెల 20 నుంచి నాలుగు నుంచి ఏడు, అంతకంటే ఎక్కువ రోజులు సమయం పడుతుంది. అమెరికన్ ఎక్స్ ప్రెస్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంకు కార్డులపై ఆపిల్ ఐ-ఫోన్ 16 ఫోన్ కొనుగోలు చేసే వారికి రూ.5000 క్యాష్ బ్యాక్ లేదా డిస్కౌంట్ లభిస్తుంది. మూడు నెలల నుంచి ఆరు నెలల వరకూ నో-కాస్ట్ ఈఎంఐ ఆప్షన్లతోపాటు రూ.67,500 ఎక్స్చేంజ్ ఆఫర్లు ఉంటాయి.ఆప్ట్రోనిక్స్, ఐవీనస్, ఇమాజిన్, ఐఫ్యూచర్, యూనికార్న్ వంటి థర్డ్ పార్టీ రిటైల్ సంస్థలు ఐఫోన్ 16 ఫోన్ల కొనుగోళ్లపై క్యాష్ బ్యాక్ అండ్ ఎక్స్చేంజ్ బోనస్ అందిస్తున్నాయి. ఎస్బీఐ, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంకు కార్డుల ద్వారా రూ.4000-5000 క్యాష్ బ్యాక్, ప్రీ ఆర్డర్ బుక్ చేసుకుంటే రూ.500 క్యాష్ బ్యాక్ తోపాటు ఎక్స్చేంజ్ బోనస్ రూ.8000 వరకూ అందిస్తున్నాయి.

## కొత్త పీపీఎఫ్ రూల్స్

### అక్టోబర్ 1 నుంచి అమల్లోకి..




పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) ఖాతాలను మైనర్ల కోసం కూడా తెరుచుకోవచ్చు. మారిన నిబంధనల ప్రకారం సదరు మైనర్లకు 18 ఏండ్లు నిండేదాకా ఈ ఖాతాలు పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ వడ్డీరేటుతో కొనసాగుతాయి. మైనార్టీ తీరిన తర్వాత పీపీఎఫ్ ఖాతాగా మార్చుకోవచ్చు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇక ఒకటికి మించి పీపీఎఫ్ ఖాతాలనూ తెరుచుకోవచ్చు. అలాగే ప్రవాస భారతీయులు (ఎన్నారైలు) పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ స్కీం (పీపీఎఫ్) 1968 కింద క్రియాశీల పీపీఎఫ్ ఖాతాలను తెరిస్తే ఫామ్ హెచ్ ద్వారా ఖాతాదారుని నివాస హోదా గురించి అడగకపోతే పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ మార్గదర్శకాల ప్రకారం ఈ నెలాఖరుదాకా ఉండే వడ్డీరేట్లు వర్తిస్తాయి. పీపీఎఫ్ అనేది కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సాధనం. అంతేగాక మదుపరులను దీర్ఘకాలిక ఆకర్షణీయ ప్రయోజనాలతో కూడిన సేవింగ్స్, పెట్టుబడులకు ప్రోత్సహించే పథకం ఇది. దీనికి ఆదాయ పన్ను (ఐటీ) మినహాయింపులూ వర్తిస్తాయి.

## యూబీఐ ప్రత్యేక డిపాజిట్ స్కీం




ప్రభుత్వ రంగ సంస్థ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిట్లను ఆకట్టుకోవడానికి ప్రత్యేక డిపాజిట్ స్కీంను మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. 333 రోజుల కాలపరిమితితో యూనియన్ సమృద్ధి స్కీంపై అధిక వడ్డీరేటును ఆఫర్ చేస్తున్నది బ్యాంక్. ఈ స్కీంలో కనీసంగా రూ.1,000 నుంచి రూ.3 కోట్ల లోపు డిపాజిట్ చేయవచ్చును. ఈ స్కీంపై సాధారణ ప్రజలకు 7.40 శాతం వార్షిక వడ్డీని చెల్లిస్తున్న బ్యాంక్..సీనియర్ సిటిజన్లకు 7.90 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్లకు 8.15 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నది బ్యాంక్. మెచ్యూర్ కాకముందే ఈ డిపాజిట్లను విత్‌డ్రా చేసుకునే అవకాశాన్ని బ్యాంక్ కల్పించింది. కానీ, ఇలా చేసుకుంటే ఒక్క శాతం వడ్డీని తగ్గి చెల్లించనున్నది. ఈ డిపాజిట్ స్కీంను ఎంచుకోవడానికి బ్యాంక్ శాఖ లేదా వెబ్‌సైట్ ద్వారా డిపాజిట్ చేయవచ్చును.

## షార్ట్-టర్మ్ ఆరోగ్య బీమా

### లాభాలు, పరిమితులు తెలుసా?



షార్ట్-టర్మ్ ఆరోగ్య బీమా తాత్కాలిక కవరేజీని కల్పిస్తుంది. దీన్నే టర్మ్ మెడికల్ ఇన్సూరెన్స్ అని కూడా పిలుస్తారు. సాధారణంగా ఇది కొద్ది నెలల నుంచి ఏడాదిదాకే ఉంటుం ది. ఎవరైతే స్టాండర్డ్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలతో వచ్చే దీర్ఘకాలిక ఆరోగ్య బీమాలు కాకుండా తక్షణ కవరేజీలను కోరుకుంటారో వారినుద్దేశించినదే ఈ పాలసీ. సమగ్ర కవరేజీని కొనలేనివారికి కూడా ఇది ఉపయుక్తంగా ఉంటుంది. కంపెనీల్లో గ్రూప్ ఇన్సూరెన్స్ కోసం వేచిచూస్తున్న ఉద్యోగులు, నిరుద్యోగులకు దీని అవసరం ఎక్కువని చెప్పవచ్చు.షార్ట్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్ శైలి కేవలం కొద్ది నెలల నుంచి ఏడాది వరకే బీమా కవరేజీ.లాంగ్-టర్మ్ ప్లాన్లతో పోల్చితే షార్ట్-టర్మ్ ప్లాన్లకు ప్రీమియంలు తక్కువే.ఇప్పటికే ఉన్న ఆరోగ్య సమస్యలకు బీమా కవరేజీ ఉండకపోవచ్చు. కొన్ని రకాల చికిత్సలకూ వీలుండదు.కనీస ఆరోగ్య సమాచారంతో ఈ ప్లాన్లను తీసుకోవచ్చు.పరిమిత స్థాయిలోనే ఈ ప్లాన్ల చెల్లుబాటు ఉంటుంది. ఎంపిక చేసిన నెట్‌వర్క్‌లో తప్ప.. అన్ని దవాఖానల్లో చెల్లవు.లాంగ్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలను రెన్యువల్ చేసుకున్నట్టుగా ఈ షార్ట్-టర్మ్ పాలసీలను రెన్యువల్ చేసుకోలేం.చివరగా షార్ట్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్‌లు తక్షణ అవసరాలకే పనికొస్తాయి. కాబట్టి లాంగ్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్‌లకే ప్రాధాన్యం ఇవ్వాలి. అప్పుడే దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలను పొందుతాం. ప్రీమియంలు ఎక్కువైనప్పటికీ క్లెయిములు లేకపోతే కవరేజీలు పెరిగే ప్రయోజనం ఉంటుంది. మెటర్నిటీ, మెంటల్ హెల్త్ తదితర అవసరాలు, సమస్యలకూ స్టాండర్డ్ హెల్త్ ఇన్సూరెన్స్‌లే లాభదాయకం అని స్పష్టంగా చెప్పవచ్చు. అందుకే సమగ్ర ప్యాకేజీని తీసుకోవడం మరువద్దు.

## అప్ డేటెడ్ హీరో డెస్టినీ 125 స్కూటర్ ఆవిష్కరణ ఇవీ డిటైల్స్



ప్రముఖ టూ వీలర్స్ తయారీ సంస్థ హీరో మోటో కార్ప్ తన అప్ డేటెడ్ డెస్టిని 125 స్కూటర్ ను ఆవిష్కరించింది. ఆరేండ్ల క్రితం తొలిసారి భారత్ మార్కెట్లో డెస్టినీ 125 స్కూటర్ ఆవిష్కరించింది. ఆల్ న్యూ డిజైన్, పెద్ద వీల్స్, మోడర్న్ అండ్ డైనమిక్ రోడ్ ప్రెజెన్స్ కోసం ఫ్రంట్ డిస్క్ బ్రేక్ ఉంటాయి. 124.6 సీసీ సింగిల్ సిలిండర్ ఇంజిన్ తో వస్తోంది. మూడు వేరియంట్లు %-% వీఎక్స్, జడ్ఎక్స్, జడ్ఎక్స్ం వేరియంట్లలో లభిస్తుంది. ఈ స్కూటర్ ధరలు ఇంకా వెల్లడించలేదు. అన్ని వేరియంట్లలో ప్రొజెక్టర్ ఎల్ఈడీ హెడ్ ల్యాంప్స్, హెచ్-షేప్డ్ ఎల్ఈడీ డే టైం రన్నింగ్ ల్యాంప్, మెటల్ ఫ్రంట్ ఫెండర్, ఎల్ఈడీ టెయిల్ ల్యాంప్, రేర్ మోనోషాక్, టెలిస్కోపిక్ ఫ్రంట్ ఫోర్క్ సస్పెన్షన్ ఉంటాయి.బూట్ ల్యాంప్, సైడ్ స్టాండ్ ఇంజిన్ కటాఫ్, ఎక్స్ టర్నల్ ఫ్యుయల్ ఫిల్లర్, సీబీఎస్, టైప్-ఏ యూఎస్బీ చార్జింగ్ పోర్ట్, 5-లీటర్ల ఫ్యుయల్ ట్యాంక్ ఉంటాయి. డ్రమ్ బ్రేక్స్, సెమీ డిజిటల్ ఇన్ స్ట్రుమెంట్ క్లస్టర్ విత్ స్మాల్ ఎల్సీడీ ఇన్ సెట్, 12 అంగుళాల కాస్ట్ అల్లాయ్ వీల్స్ ఉంటాయి. హీరో డెస్టినీ 125 వీఎక్స్ స్కూటర్ గ్రోవీ రెడ్, ఎటర్నల్ వైట్, రీగల్ బ్లాక్ కలర్ ఆప్షన్లలో లభిస్తుంది.హీరో డెస్టినీ 125 జడ్ఎక్స్ వేరియంట్ ఫ్రంట్ డిస్క్ బ్రేక్, 12 అంగుళాల డైమండ్ కట్ అల్లాయ్ వీల్స్ కలిగి ఉంటుంది. మెస్టిక్యూ మెజెంటా, కాస్మిక్ బ్లూ కలర్ ఆప్షన్లలో లభిస్తుంది. జడ్ఎక్స్ వేరియంట్ స్కూటర్ తో పోలిస్తే జడ్ఎక్స్ం వేరియంట్ స్కూటర్ లో అదనపు ఫీచర్లు ఉన్నాయి. ఫ్రంట్ ఆప్రన్ మీద క్రోమ్ కాపర్ అసెంట్స్, సైడ్ ప్యానెల్స్, రేర్ వ్యూ మిర్రర్స్, టెయిల్ సెక్షన్, 12 అంగుళాల మెషిన్డ్ అల్లాయ్ వీల్స్ ఉంటాయి. జడ్ఎక్స్ం వేరియంట్ స్కూటర్ ఎబోనీ వైట్, రీగల్ బ్యాక్ కలర్ ఆప్షన్లలో లభిస్తుంది.

## ఫెడ్ నిర్ణయమే కీలకం..




దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల జోష్‌లో సాగుతున్నాయి. మదుపరులు పెట్టుబడులకు మద్దతు పలుకుతున్నారు. గత వారం ట్రేడింగ్‌లో గురువారం ఒక్కరోజే సెన్సెక్స్ 1,440, నిఫ్టీ 470 పాయింట్లు పెరిగాయి. ఈ క్రమంలోనే వారం మొత్తంగా సూచీలు భారీ ఎత్తున పుంజుకోగలిగాయి. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,707.01 పాయింట్లు ఎగిసి 82,890.94 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 504.35 పాయింట్లు ఎగబాకి 25,356.50 దగ్గర ముగిసింది. మునుపెన్నడూ లేనివిధంగా సెన్సెక్స్ తొలిసారి 83వేల మార్కును అధిగమించింది. నిఫ్టీ సైతం నూతన గరిష్ఠాలను తాకింది. ఈ నేపథ్యంలో ఈ వారం అమ్మకాల ఒత్తిడికి ఆస్కారం కనిపిస్తున్నది. శుక్రవారమే మార్కెట్లలో సెల్లింగ్ ప్రెషర్ ఉండటాన్ని గమనించవచ్చు. పారిశ్రామికోత్పత్తి మందగించడం, ద్రవ్యోల్బణం మళ్లీ విజృంభిస్తున్న సంకేతాలు రావడంతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు బ్రేక్ వేయవచ్చన్న అభిప్రాయాలను మెజారిటీ నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. పైగా సూచీలు ఆల్‌టైమ్ హైల్లో ఉండటం కూడా లాభాల స్వీకరణకు తావిస్తోందంటున్నారు. ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య సమీక్ష ప్రభావం కూడా కనిపించ నున్నది. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,900 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,700 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 25,700-25,900 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

**చివరగా..**

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఏ బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

## బంగారమే శ్రీరామరక్ష!

ఆపత్కాలంలో ఆదుకునేది బంగారం మాత్రమే. సమయానికి చేతిలో చిల్లిగవ్వ లేనప్పుడు ఈ పుత్తడే మీకు పరమాన్నంగా మారుతున్నది. ఆరోగ్యం బాగోలేక ఆసుపత్రి పాలైనప్పుడు ఈ గోల్డే మీకు ఆర్థికంగా ఆదుకుంటుంది. ఆర్థిక సంక్షోభం చుట్టుముట్టినప్పుడు బంగారమే శ్రీరామరక్ష. సామాన్యుడి నుంచి మొదలుకొని సంపన్నవర్గాలు కూడా ప్రతియేటా బంగారం ఎంతోకొంత కొనుగోలు చేస్తున్నారు. అక్కరకు వచ్చినప్పుడు ఈ గోల్డ్‌ను తాకట్టుపెట్టుకొని రుణాలు తీసుకుంటున్నారు. వీటికోసం బ్యాంకులతోపాటు ఆర్థిక సేవల సంస్థలు ప్రత్యేకంగా పసిడిపై రుణాలు మంజూరు చేస్తున్నాయి. సెక్యూర్డ్ రుణాలు కావడంతో బంగారం విలువలో 80 శాతం వరకు రుణాలు మంజూరు చేస్తున్నాయి బ్యాంకులు, ఆర్థిక సేవల సంస్థలు. బంగారం కడ్డీలతోపాటు ఆభరణాలు తాకట్టుపెట్టుకొని కేవలం కొన్ని నిమిషాల్లోనే రుణం పొందవచ్చును. వ్యక్తిగత రుణాలు, ఇతర రుణాలు తీసుకోవాలంటే రోజుల సమయం పడుతుంది కానీ, బంగారంపై రుణాలు తీసుకోవడం ఎంతో సులభం. పెద్దగా డాక్యుమెంట్లు లేకుండానే తీసుకోవచ్చును. తక్కువ వడ్డీకే రుణాలు తీసుకోవచ్చును. ఏయే బ్యాంకుల్లో ఎంత వడ్డీని ఆఫర్ చేస్తున్నాయి. ప్రభుత్వరంగ బ్యాంకులతోపాటు ప్రైవేట్ రంగ బ్యాంకులు 8 శాతం మొదలు కొని 24 శాతం వరకు వడ్డీని ఆఫర్ చేస్తున్నాయి. తీసుకున్న రుణాలను ఏడాదిలోగా చెల్లించాల్సి ఉంటుంది. లేకపోతే బ్యాంకులు తాకట్టుకింద పెట్టిన ఆభరణాలను జప్తు చేసుకొని వేలం వేసుకునే అధికారం ఉంటుంది. పసిడి విలువను గుర్తించడంలో ఒక్కో బ్యాంకుది ఒక్కో తీరుగా ఉంటుంది.

**క్రెడిట్ స్కోర్ అక్కర్లేదు..**

సిబిల్ స్కోర్ లేకుండానే బంగారంపై రుణాలు తీసుకోవచ్చును. కేవలం బంగారం లేదా ఆభరణాలు తాకట్టు పెట్టుకొని రుణాలు తీసుకోవచ్చును. దీనికోసం వారి క్రెడిట్ స్కోర్ ఎంత ఉన్నదో అవసరం లేదు. 500 లోపు సిబిల్ స్కోర్ ఉన్నవారు కూడా సులువుగా రుణాలు తీసుకోవచ్చును.

**కావాల్సిన డాక్యుమెంట్లు**

బంగారం తాకట్టుపై రుణాలు తీసుకోవడానికి పలు డాక్యుమెంట్లు అవసరం ఉంటాయి. వీటిలో ఆధార్ కార్డుతోపాటు పాన్ కార్డు, బ్యాంక్ ఖాతాతోపాటు కేవైసీ డాక్యుమెంట్ సమర్పించాల్సి ఉంటుంది. మనం తీసుకునే బ్యాంకులోనే ఖాతా ఉండాల్సి ఉంటుంది. ఇటీవలకాలంలో బ్యాంకులతోపాటు పసిడిపై రుణాలు ఎన్‌బీఎఫ్‌సీలు కూడా ఇస్తున్నాయి.

**తిరిగి చెల్లింపులు ఎలా..**

బంగారంపై తాకట్టుపై రుణాలు తీసుకున్నవారు మూడు రకాలుగా తిరిగి చెల్లింపులు జరుపుకునే అవకాశాలను బ్యాంకులు



కల్పించాయి. వీటిలో నెలవారి చెల్లింపుల రూపంలో చెల్లింపులు జరుపుకోవచ్చును, లేదా మూడు నెలల్లో వడ్డీతో సహా తీసుకున్న రుణాన్ని చెల్లించవచ్చును. అలాగే ఆరు నెలలు, ఏడాది కాలపరిమితితో తీసుకున్న రుణాలను వడ్డీతో కలుపుకొని చెల్లించుకోవచ్చును. ఒకవేళ ఏడాది ముగిసిన తర్వాత తీసుకున్న రుణానికి వడ్డీని చెల్లించి మళ్లీ రెన్యూవల్ చేసుకోవచ్చు.

## భారత్ మార్కెట్లోకి ఎంజీ విండ్సార్ రూ.9.99 లక్షల నుంచి షురూ


ప్రముఖ కార్ల తయారీ సంస్థ జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా.. దేశీయ మార్కెట్లోకి తన విండ్సార్ ఈవీ కారును తీసుకొచ్చింది. ఈ కారు ధర రూ.9.99 లక్షల (ఎక్స్ షోరూమ్) నుంచి ప్రారంభం అవుతుంది. జడ్ఎస్ ఈవీ, కామెట్ ఈవీ తర్వాత జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా నుంచి మార్కెట్లోకి వచ్చిన మూడో కారు ఇది. అయితే, అన్ని వేరియంట్ల విండ్సార్ ఈవీ కార్ల ధరలను కంపెనీ ప్రకటించలేదు. ఈ నెల 25 నుంచి టెస్ట్ డ్రైవ్ ప్రారంభం కానున్నది. అక్టోబర్ మూడో తేదీ నుంచి బుకింగ్స్ మొదలవుతాయి. అక్టోబర్ 12 నుంచి కార్ల డెలివరీ ప్రారంభించనున్నది జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా.ఫస్ట్ కార్ల కొనుగోలు దారులకు విండ్సార్ ఈవీపై జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా యాజమాన్యం అపరిమిత కి.మీతో కూడిన లైఫ్ టైం వారంటీ ఆఫర్ చేస్తోంది. కొనుగోలు చేసిన మూడేండ్ల తర్వాత ఈ కారుపై 60 శాతం రీ సేల్ విలువ ఉంటుందని తెలుస్తోంది. అందుకే మూడేండ్ల పాటు సమగ్ర వారంటీ, మూడేండ్ల పాటు రోడ్ సైడ్ అసిస్టెన్స్, మూడేండ్లు నో లేబర్ చార్జీలను ఆఫర్ చేస్తున్నది.ఎంజీ విండ్సార్ ఈవీ కారు పర్మినెంట్ మ్యాగ్నెట్ సింక్రోనియస్ మోటార్ విత్ 38కిలోవాట్ల లిథియం ఐరన్ ఫాస్పేట్ (ఎల్ఎఫ్పీ) బ్యాటరీతో వస్తుంది. ఈ ఇంజిన్ గరిష్ఠంగా 136 పీఎస్ విద్యుత్, 200 ఎన్ఎం టార్క్ వెలువరిస్తుంది. సింగిల్ చార్జింగ్ పూర్తయితే 331 కి.మీ దూరం ప్రయాణించగలుగుతుంది. ఎయిరోగ్లైడ్ డిజైన్ తో వస్తున్న వెరీ ఫ్యూచరిస్టిక్ ఈవీ కారు విండ్సార్ ఈవీ. ఇల్యూమినేటెడ్ ఫ్రంట్ లోగో, ఎల్ఈడీ లైట్స్ (హెడ్ అండ్ టెయిల్), ఫ్లష్ డోర్ హ్యాండిల్స్, 18 అంగుళాల అల్లాయ్ వీల్స్ వంటి ఫీచర్లు ఉంటాయి.విండ్సార్ ఈవీ కారు క్యాబిన్ లోపల ఎయిరో లాంజ్ సీట్లు, ఫ్రంట్ వెంటిలేటెడ్ సీట్లు, ఎయిర్లైన్ ఇన్స్పైర్డ్ సీట్ అప్ హోల్‌స్టరీ, 15.6 అంగుళాల టచ్ స్క్రీన్ ఇన్ఫోటైన్ మెంట్ సిస్టమ్ విత్ వైర్ లెస్ ఆండ్రాయిడ్ ఆటో, ఆపిల్ కార్ ప్లే కనెక్టివిటీ, ఆటోమేటిక్ క్లైమేట్ కంట్రోల్ విత్ ఏ ఫిజికల్ ప్యానెల్, 9-స్పీకర్ సౌండ్ సిస్టమ్, పీఎం 2.5 ఫిల్టర్ అండ్ పనోరమిక్ సన్ రూఫ్ తదితర ఫీచర్లు ఉన్నాయి. 135 డిగ్రీల రీసైక్లైన్ యాంగిల్ తోపాటు 60:40 స్ప్లిట్ రేర్ సీట్లు ఉంటాయి. ఎంజీ-జియో ఇన్నోవేటివక్ కనెక్టివిటీ ప్లాట్ ఫామ్ (ఎంజీ-జియో ఐసీపీ) కల తొలి జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా కారు విండ్సార్ ఈవీ.80కి పైగా కనెక్టెడ్ ఫీచర్లతో ఐ-స్మార్ట్ కనెక్టివిటీ, వెహికల్ ఆపరేషన్స్ కోసం డిజిటల్ బ్లూటూత్ కీ, పవర్డ్ టెయిల్ గేట్, 36కిపైగా స్టాండర్డ్ సేఫ్టీ ఫీచర్లతో వస్తోంది



విండ్సార్ ఈవీ కారు. టాటా నెక్సాన్ ఈవీ, మహీంద్రా ఎక్స్‌యూవీ 400 కార్ల కంటే చౌక. టాటా నెక్సాన్ ఈవీ ధర రూ.12.49 లక్షల నుంచి, మహీంద్రా ఎక్స్‌యూవీ 400 కారు ధర రూ.15.49 లక్షల నుంచి ప్రారంభం అవుతుంది. టాటా పంచ్ ఈవీ కారు ధర రూ.9.99 లక్షల నుంచి మొదలవుతుంది.





## సైబర్ మోసాలకు కూడా ఇన్సూరెన్స్ కేవలం రూ.3తోనే మీ డబ్బులను భద్రంగా కాపాడుకోవచ్చు

సైబర్ మోసాలు రోజురోజుకూ ఎక్కువైపోతున్నాయి. పెరుగుతున్న టెక్నాలజీనే ఆసరాగా తీసుకొని సైబర్ నేరగాళ్లు దాడులకు తెగబడుతున్నారు. దీంతో బాధితులకు రక్షణే లేకుండాపోతున్నది. అందుకే ఇన్సూరెన్స్ కంపెనీలు ఇప్పుడు ఈ కోణంలో దృష్టి పెడుతున్నాయి. ఈ క్రమంలోనే ఆయా బీమా సంస్థలు.. సైబర్ మోసాలకు రక్షణగా సాషే ప్రోడక్ట్స్‌ను పరిచయం చేస్తున్నాయి. ఈ రిస్క్ కవరేజీలు కేవలం రోజుకు రూ.3కే లభిస్తుండటం విశేషం. వ్యక్తులు, వ్యాపార సంస్థల అవసరాలకు తగ్గట్టుగా ఈ చిన్న ప్లాన్లను ఇన్సూరర్లు రూపొందిస్తున్నారు.




**ఏఐ వినియోగంతో..**

మోసగాళ్ల చేతికి సాంకేతిక పరిజ్ఞానం చిక్కితే జరిగే నష్టం అపారం. ఇప్పుడు సైబర్ ప్రపంచంలో కృత్రిమ మేధస్సు (ఏఐ)తో మోసగాళ్లు చేస్తున్నదిదే. జెన్‌ఏఐ సాయంతో నకిలీ వీడియోలు, వాయిస్ క్లోనింగ్‌లు, టెక్స్ సందేశాలు, ఎస్ఎంఎస్ ఫిషింగ్, ఫ్రాడ్ కాల్స్, ఫేస్ మార్ఫింగ్, ఓటీపీ చోరీలకు దిగుతున్నారు. వీటితో వ్యక్తులు, సంస్థలను బెదిరిస్తూ అక్రమాలకు తెగబడుతున్నారని హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ డైరెక్టర్ పార్థనీల్ ఘోష్ అన్నారు. ఈ సంస్థ ఇప్పటికే మాల్‌వేర్, రాన్సమ్‌వేర్ సైబర్ దాడులను ఎదుర్కొనేలా వ్యక్తులు, వ్యాపార సంస్థల కోసం ఓ సైబర్ సాషే ఇన్సూరెన్స్ పాలసీని తీసుకొచ్చింది.

పెరుగుతున్న మార్కెట్ విలువ

భారతీయ సైబర్ ఇన్సూరెన్స్ మార్కెట్ విలువ 2023లో 50-60 మిలియన్ డాలర్లుగా ఉన్నది. అయితే ఇది రాబోయే ఐదేండ్లలో 27-30 శాతం వృద్ధి చెందవచ్చని డెలాయిట్ ఇటీవల నిర్వహించిన ఓ అధ్యయనంలో అంచనా వేసింది. ఇందుకు తగ్గట్టుగానే ఎస్బీఐ జనరల్, హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో, ఐసీఐసీఐ లాంబార్డ్‌లు సైబర్ రిస్క్ కవరేజీ ప్లాన్లను తీసుకొస్తున్నాయి. కాగా, జెన్‌ఏఐ దన్నుతో జరుగుతున్న మోసాల వల్ల ఆర్థికపరమైన నష్టమేగాక సంస్థల పరపతి, వ్యక్తుల పరువు-ప్రతిష్ఠలూ దెబ్బతింటున్నాయని ఇన్సూరెన్స్ బ్రోకింగ్ కంపెనీ లాక్టోన్ ఇండియా సీఈవో సందీప్ దాడియా అన్నారు. బలమైన లీగల్ ప్రొటెక్షన్ కోసం ఓ డిజిటల్ పర్సనల్ డాటా ప్రొటెక్షన్ చట్టాన్నీ తేవాలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. వ్యక్తిగత సమాచార చోరీకి కంపెనీలదే బాధ్యతన్నారు.

**జాగ్రత్తలు అవసరం**

పెరుగుతున్న సైబర్ దాడుల నేపథ్యంలో అంతా జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సలహా ఇస్తున్నారు. ఏఐ ఆధారిత టెక్నాలజీతో నకిలీ మాయాజాలం నడుస్తున్నదని, అన్ని రకాలుగా నష్టపరుస్తున్నారంటున్నారు. అందుకే ఆన్‌లైన్‌లో ఉన్నప్పుడు చాలాచాలా అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. అనవసరపు లింక్స్‌పై క్లిక్ చేయవద్దని, అపరిచితుల కాల్స్, మెసేజ్‌లకు స్పందించకపోవడమే ఉత్తమమంటున్నారు. వ్యక్తిగత ఫోటోలను సైతం తరచూ ఆన్‌లైన్, సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేయవద్దని, కొత్తకొత్త యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దని కూడా హెచ్చరిస్తున్నారు. విలువైన సమాచారాన్ని (బ్యాంక్ ఖాతా నెంబర్లు, ఓటీపీలు, పాస్‌వర్డులు) స్మార్ట్‌ఫోన్లలో సేవ్ చేసుకోవడం, ఈ-మెయిల్స్‌లో పంపించుకోవడం మానేయడం మంచిదనీ సైబర్ ఎక్స్‌పర్ట్స్ చెప్తున్నారు.

**ఏమిటీ సాషే ఇన్సూరెన్స్**

సాషే ఇన్సూరెన్స్ ప్రొడక్ట్స్ అంటే చిన్న పరిమాణంలో ఉండే బీమా పాలసీలు. సాధారణంగా ఇవి ప్రయాణం, దొంగతనం, గృహోపకరణాలు, ఫిట్నెస్ వంటి కొన్ని అంశాలకు సంబంధించి రూపొందుతాయి. ఇంకా చెప్పాలంటే పరిమిత శ్రేణిలో, తాత్కాలిక రక్షణే లక్ష్యంగా ఈ బీమా పాలసీలుంటాయి. సంప్రదాయ ఇన్సూరెన్స్ పాలసీలైతే జీవిత, ఆరోగ్య, ఆస్తుల వంటి అంశాలపై సమగ్ర రీతిలో లభిస్తాయి.

**ఏయే కవరేజీలు?**

ఐడెంటిటీ చోరీ, సైబర్ స్టాకింగ్, ఫిషింగ్, ఈ-మెయిల్ స్పూఫింగ్, సైబర్ దోపిడి, నిధుల దొంగతనం, డాటా అపహరణ వంటి వాటికి ఈ బీమా రక్షణ కల్పిస్తుంది. న్యాయపరమైన వ్యవహారాల్లో ఖర్చులను బీమా సంస్థలే ఇస్తాయి.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2O18/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com